ప్రధానమంత్రికి గల్ఫ్ కార్మికుల లేఖ

మాట్లాడుతున్న గల్ఫ్ ప్రతినిధులు

జగిత్యాల, మార్చి 17: గల్ఫ్ కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమం, కేంద్ర ప్రభుత్వ పక్షాన సౌకర్యాల కల్పన, హక్కుల గురించి జగిత్యాలకు వస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి గల్ఫ్ జేఏసీ, టీపీసీసీ కమిటీ సభ్యులు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గల్ఫ్‌దేశాల్లో 88 లక్షల మంది వలస కార్మికులు నివసిస్తున్నారన్నారు. విదేశీ మారక ద్రవ్యాన్ని పొందే దేశాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. 2023లో 125 బిలియన్ యూఎస్ డాలర్ల (రూ.10లక్షల25 వేలకోట్లు) విలువైన విదేశీ మారకాన్ని దేశం పొందిందన్నారు. ఇది స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.4 శాతమన్నారు. భారత్ పొందే విదేశీ మారకంలో సగానికి పైగా గల్ఫ్ దేశాల నుంచే లభిస్తుందన్నారు. దేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం పంపిస్తున్న ప్రవాస భారతీయ కార్మికుల సేవలను గుర్తించాలని కోరారు. గల్ఫ్ దేశాల్లో పర్యటించిన మోదీ గల్ఫ్ వలస కార్మికుల సామాజిక భద్రత, సంక్షేమం గురించి పెద్దగా పట్టించుకోలేదని వాపోయారు. ప్రవాసీ భారతీయ బీమా యోజన (రూ.10లక్షల ప్రమాద బీమా) పథకంలో సహజ మరణాన్ని చేర్చాలన్నారు. బీమా సౌకర్యం అందరికీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. గల్ఫ్ దేశాల నుంచి తిరిగి వచ్చి గ్రామాల్లో ఉన్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల లబ్ధిదారులుగా పరిగణించాలన్నారు. రేషన్‌కార్డు లేదనే సాకుతో సంక్షేమ పథకాలకు వారిని దూరం చేయొద్దని లేఖలో విన్నవించారు. విలేకరుల సమావేశంలో గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్, టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ నాయకులు రాజిరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

కూలికి వెళ్తూ.. మృత్యు ఒడికి

- జగిత్యాల జిల్లా వెంకటాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్
- అక్కడికక్కడే ఇద్దరు
- హాస్పిటల్‌కు తరలిస్తుండగా మరొకరూ దుర్మరణం

పసుపులేటి శ్రీకాంత్,బడికెల వేణుగోపాల్,వెంకటేశ్(ఫైల్)

కోరుట్ల రూరల్, మార్చి 17: జగిత్యాల జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ఆదివారం ఉదయం బైక్‌పై కూలి పనులకు వెళ్తూ ఆగిఉన్న లారీని ఢీకొట్టిన ప్రమాదంలో మృత్యు ఒడికి చేరారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన మేస్త్రీ బడికెల వేణుగోపాల్(30), అదే గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీకాంత్(23), కొండగట్టుకు చెందిన వెంకటేశ్ (30) ఆదివారం ఉదయం బైక్‌పై భవన నిర్మాణ పనుల కోసం కోరుట్లకు బయల్దేరారు. కోరుట్ల మండలం వెంకటాపూర్ శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శ్రీకాంత్, వెంకటేశ్ అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడ్డ వేణుగోపాల్‌ను '108'లో జగిత్యాల దవాఖానకు తరలిస్తుండగా మరణించాడు. వేణుగోపాల్‌కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పసుపులేటి శ్రీకాంత్ ముత్యంపేటలో తల్లి లక్ష్మితో కలిసి కూలీ పనులకు వెళ్తూ జీవిస్తున్నాడు. ఏడాది క్రితం వివాహం జరగగా భార్య శ్రీషిష నాలుగు నెలల గర్భిణి. వెంకటేశ్ భార్య సాయమ్మ, ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోగా కొండగట్టులో ఒంటరిగా ఉంటున్నాడు. భార్యాపిల్లలు రాకపోవడంతో పోలీసులు కోరుట్ల మున్సిపల్ కార్మికుల సాయంతో వెంకటేశ్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా పసుపులేటి శ్రీకాంత్ తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోరుట్ల ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

గంభీర్‌పూర్ విద్యార్థికి ఎల్లో బెల్ట్

కథలాపూర్, మార్చి 17: గంభీర్‌పూర్‌కు చెందిన రెండో తరగతి విద్యార్థి జవ్వాజి మహన్ కరాటేలో ప్రతిభ చాటాడు. హైదరాబాద్‌లో సినీ హీరో సుమన్ ఆదివారం మహన్‌కు ఎల్లో బెల్ట్‌ను ప్రదానం చేశారు. మహన్ ఎల్లో బెల్ట్ అందుకోవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★KNR సుభాష్‌నగర్‌లోని పుల్లిల హాస్పిటల్‌లో పనిచేయుటకు రిసెప్షనిస్ట్ (డిగ్రీ & కంప్యూటర్ నాలెడ్జ్), ఫార్మాసిస్ట్, డిఫార్మసీ/బీఫార్మసీ, నర్సింగ్ స్టాఫ్ (ANM/GNM) కావలెను. స్వయంగా సంప్రదించగలరు.
NTK-317415
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 1వరకు జాతర

విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న ఆలయ రాజగోపురాలు

గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ధర్మపురి, మార్చి 17: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 20 నుంచి ఏప్రిల్1వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు కలెక్టర్ యాస్మిన్ బాషా అధ్యక్షతన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో, జాతర ఉత్సవ కమిటీ సూచనల మేరకు ఆలయానికి రంగులు వేసి రాజగోపురాలు, స్వాగత తోరణాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, కౌంటర్లను ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు వేశారు. గోదావరి తీరంలో మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గదులు ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్స్, విజయ డెయిరీ వారి సహకారంతో మజ్జిగ ప్యాకెట్లు అందజేయనున్నారు. ఆర్యవైశ్య వర్తక సంఘం, రైస్‌మిల్లర్లు, దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈనెల 20 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు

- ఈ నెల 20న(బుధవారం) యాజ్ఞాచార్యుల ఆహ్వానం, కళశ, విశ్వక్షేన, వాసుదేవ, పుణ్యాహవచనం, బ్రహ్మకళశ స్థాపన, అంకురార్పణ, వరాహతీర్థం, పుట్టబంగారం తెచ్చుట
- 21న (గురువారం) సాయంత్రం 5గంటలకు స్వామివారి కల్యాణం
- 22న రాత్రి 7గంటలకు లక్ష్మీనరసింహ స్వామి ఊరేగింపు సేవ
- 23న వేంకటేశ్వరస్వామి ఊరేగింపు సేవ
- 24న కోనేరులో పాత(యోగ)నరసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం
- 25న కోనేరులో ఉగ్ర నరసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం
- 26న కోనేరులో వేంకటేశ్వరస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం, లక్ష్మీనరసింహ స్వామి దక్షిణ దిగ్యాత్ర
- 27న లక్ష్మీనరసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర, బోగమండపం, వేద సదస్సు
- 28న వేంకటేశ్వర స్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు
- 29న పూర్ణాహుతి, రథోత్సవం, చక్రతీర్థం, యోగ నరసింహస్వామి పుష్పయాగం
- 30న వేంకటేశ్వర స్వామి పుష్పయాగం, యోగ నరసింహస్వామి ఏకాంతోత్సవం
- 31న ఉగ్ర నరసింహస్వామి పుష్పయాగం, వేంకటేశ్వరస్వామి ఏకాంతోత్సవం
- ఏప్రిల్ 1న ఉగ్ర నరసింహస్వామి ఏకాంతోత్సవ నిర్వహణతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

నేడు ఆలయ కమిటీ ఎన్నిక

పెగడపల్లి, మార్చి 17: మండల కేంద్రంలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయ కమిటీ ఎన్నికను సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భూమాడి గంగారెడ్డి, బైర పోచయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత కమిటీ పదవీ కాలం పూర్తవుతున్నందున ఉదయం 10 గంటలకు నూతన కమిటీని ఆలయ ఆవరణలో ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

పెగడపల్లి, మార్చి 17: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బతికపల్లిలో ఆదివారం జరిగింది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వడకాపురం భాస్కర్ (35)కు అప్పులు ఎక్కువవడంతోపాటు కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో ఆదివారం భాస్కర్ తన ఇంట్లోని బాత్రూంలో ఇనుప పైపునకు ఉరేసుకున్నాడు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజావాణి రద్దు

జగిత్యాల, మార్చి 17: జిల్లా కేంద్రంలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉండడంతో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

మేడిపల్లి, మార్చి 17: మాల కులాల కార్పొరేషన్ ఏర్పాటుపై మాల మహానాడు మండలాధ్యక్షుడు బక్కూరి నరేశ్ హర్షం వ్యక్తం చేశారు. మాల కులస్తుల ఆర్థిక సామాజిక అభివృద్ధి కోసం మాల కులాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. మాల కులాల కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సంగీత, నాటక అకాడమీ చైర్మన్‌గా అలేఖ్య

పుంజాల అలేఖ్య

జగిత్యాల, మార్చి 17: తెలుగు విశ్వవిద్యాలయంలో నృత్య బోధకురాలు, తెలుగు విశ్వవిద్యాల యం రిజి స్ట్రా ర్ హోదా అం దుకున్న తొలి మహిళ పుం జాల అలేఖ్యరా ష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈసందర్భం గా తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ హరి అశోక్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కొమురెడ్డి విజయ్‌ఆజాద్ ఆదివా రం పుష్పాల నారాయణ, హరి నర్సయ్య పటే ల్ స్మారక భవన్‌లో పుంజాల అలేఖ్య నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగాధర్, హన్మంత్‌రెడ్డి, విజయ్, రమణ, గంగారాం, జగన్, రఘునందన్‌రెడ్డి, అశోక్, హరి రవీందర్, నర్సింగారా వు, విఠల్, కిశోర్ కుమార్, శ్రీధర్, మనోహర్ పటేల్, విజయ, జలజ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించడమే లక్ష్యం

కోరుట్ల, మార్చి 17: ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే లక్ష్యంగా సంఘటితంగా ఉద్యమిద్దామని, భావ సారూప్యత కలిగిన మేధావులు, ప్రజాస్వామ్యవాదులు కలిసి రావాలని ప్రజాస్వామ్య పరిక్షణ సమితి నిజామాబాద్ జిల్లా కన్వీనర్ డాక్టర్ రవీంద్ర నాథ్ సూరి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీ ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కుల, మత, భాషల పరంగా విద్వేషాలు రెచ్చగొట్టే వాళ్లకు ఓటుతో సరైన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం డాక్టరేట్‌కు ఎంపికైన ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు పేట భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశంలో సమితి నిజామాబాద్ పార్లమెంట్ స్థాయి కో ఆర్డినేటర్ షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

మాల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

పెగడపల్లి, మార్చి 17: పెగడపల్లిలో మాల సంఘం భవనంలో ఆదివారం సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా కుక్కల వెంకట్రాజం, ప్రధాన కార్యదర్శిగా సీగిరి విజయ్, ఉపాధ్యక్షుడిగా చిన్నం సంజీవ్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా చాట్ల శంకర్, దాసరి హన్మంతు, కుక్కల పురుషోత్తం, నిమ్మ రాజలింగ్, సీగిరి శ్రీనివాస్, ఓరెం దామోదర్, కామాద్రి సంతోశ్, కొలకాని సంకెండ్ల వీరయ్య ఎన్నికయ్యారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది

మెట్‌పల్లి: విగ్రహానికి ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి, మార్చి 17: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల షెడ్యూ ల్ విడుదల కావడంతో కోడ్ అమలులోకి వ చ్చింది. ఈ నేపథ్యంలో మెట్‌పల్లిలో ఆదివారం మాజీ ప్రధానమంత్రులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, మాజీ ఎమ్మెల్యే తుమ్మల వెంకటరమణారెడ్డి తదితర నాయకుల విగ్రహాలకు ముసుగు వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు విగ్రహాలకు ముసుగు వేసినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు

పెగడపల్లి/మేడిపల్లి, మార్చి 17: నేటి నుంచి నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెగడపల్లి మండల కేంద్రంలోని టీఎస్ మోడల్ స్కూల్, మేడిపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్ జూనియర్ కళాశాల (బాలుర), మేడిపల్లి శ్రీక్రిష్ణవేణి టాలెంట్ స్కూల్, భీమారం జడ్పీ ఉన్నత పాఠశాల, మన్నెగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవోలు శ్రీనివాస్, గంగుల నరేశ్ తెలిపారు. పదో తరగతి పరీక్షల దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించడంతో పాటు, కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఇద్దరు కంటే ఎక్కువ సంఖ్యలో ఉంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమ్మాయి వివాహానికి ట్రస్ట్ చేయూత

మారుతీనగర్, మార్చి 17: పేదింటి అమ్మాయి వివాహానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చేయుతనందించారు. ఆదివారం మెట్‌పల్లిలోని అమ్మాయి వివాహానికి పుస్తె, మట్టెలు, పట్టుచీర, విందుకు సరిపడా సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, గణేశ్, రాంప్రసాద్, నరేశ్, మణిదీప్, శివ, రాహుల్ తదితరులున్నారు.

విప్‌ను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కథలాపూర్, మార్చి 17: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను అంబారిపేటకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదివారం వేములవాడలో కలిశారు. సంఘం భవనానికి నిధులు, వీరబ్రహ్మం ఆలయం వద్ద బోరుబావి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు సద్గురుచారి, శ్రీరాములు ప్రకాశ్, తిరుమల్, మహేశ్, జనార్ధన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

భూమవ్వ (ఫైల్)

మారుతీనగర్, మార్చి 17: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరపేటలో జరగింది. వివరాల్లోకి వెళ్తే.. ఆరపేటలోని బస్టాప్ సమీపంలో శనివారం రాత్రి రోడ్డు దాటుతున్న బాదినేని భూమవ్వ, నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వను ఓ కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వను జగిత్యాల దవాఖానకు తరలించారు. తీవ్ర గాయాలైన బాదినేని భూమవ్వకు మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం భూమవ్వను నిజామాబాద్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. నల్ల లక్ష్మి, శనిగారపు తుక్కవ్వ జగిత్యాల దవాఖానలో చికిత్స పొందుతున్నారు. కాగా శనిగారపు రాజేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమానికి విద్యార్థుల విరాళం

విరాళం అందజేస్తున్న విద్యార్థులు

జగిత్యాల, మార్చి 17: జిల్లాకేంద్రంలోని గుట్ట రాజేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న శివగాయత్రి అనాథ ఆశ్రమానికి పట్టణంలోని ప్రభుత్వ ఫోర్ట్ హైస్కూల్‌లో చదువుతున్న ఉర్దూ మీడియం (ఎనిమిదో తరగతి) విద్యార్థులు రూ.5 వేల విరాళం ఇచ్చినట్లు ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠ్యాంశంలో భాగంగా శనివారం ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ సమిరొద్దీన్‌తో పాటు విద్యార్థులు ఆశ్రమాన్ని సందర్శించారు. రూ 5 వేలు అందజేసి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అస్మా కౌసర్, ఖాసియా ఫాతిమా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఎన్ఎస్ఎస్ శిబిరం

రోడ్లను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కొడిమ్యాల, మార్చి 17: మండలకేంద్రంలోని ఇందిరానగర్‌కాలనీలో ఆదివారం కరీంనగర్‌కు చెందిన వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం రెండో రోజుకు చేరింది. ఆదివారం విద్యార్థులు కాలనీలో రోడ్లను శుభ్రం చేసి పిచ్చిమొక్కలను తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఇక్కడ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపికృష్ణ, మాజీ ఉపసర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి, రవిచందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

మేడిపల్లిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మేడిపల్లి, మార్చి 17: వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం మేడిపల్లిలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంకం వినోద, విజయసాగర్, మాజీ సర్పంచ్ ద్యావనపెల్లి అభిలాష్, నాయకుడు బత్తుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మెట్‌పల్లి: ప్రశంసాపత్రాలు, బెల్టులతో విద్యార్థులు

మెట్‌పల్లి, మార్చి 17: మెట్‌పల్లిలోని కూబ్‌సింగ్ కుంట వద్ద చిల్డ్రన్స్ పార్క్‌లో జేకేఏఐ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు వంశీనాయుడు, ప్రవీణ్‌కుమార్, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్, ఆల్‌రౌండర్ గంగాధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మెట్‌పల్లి, మార్చి 17: మెట్‌పల్లిలోని మాంసం (నాన్‌వెజ్) మార్కెట్‌ను మున్సిపల్ శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం మేక, పోట్టెళ్ల, చికెన్, చేపల మాంసం దుకాణాలను పరిశీలించారు. ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో మాంసం విక్రయించొద్దని, నాణ్యతా ప్రమాణాలను విధిగా పాటించాలని విక్రయదారులకు సూచించారు. వ్యర్థపదార్థాలను మున్సిపల్ వాహనాలకు అందించి పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. ఇక్కడ మున్సిపల్ సిబ్బంది ముజీబ్, నరేశ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కవులు, కళాకారులకు జగిత్యాల పుట్టినిల్లు

- సినీ, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ
- ముగిసిన భారతీ సాహిత్య సమితి స్వర్ణోత్సవ వేడుకలు

నింబగిరి నరసింహ శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీ, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, నిర్వాహకులు

కోరుట్ల, మార్చి 17: కవులు, కళాకారులకు పుట్టినిల్లు జగిత్యాల జిల్లా అని సినీ, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ కొనియాడారు. పట్టణంలోని సినారె కళాభవనంలో భారతీ సాహిత్య సమితి స్వర్ణోత్సవ ముగింపు వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకలకు సినీ, గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా కోరుట్ల వాస్తవ్యులు, బహు గ్రంథకర్త, కవి, అష్టావధాని అందె వెంకటరాజం రచించిన నింబగిరి నరసింహ శతకం పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెంకటరాజం అందించిన సాహితీ సేవలు ఆదర్శ ప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు రామచార్యులు, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, నిర్వాహకులు అందె రాజేంద్ర, భూమేశ్వర్, శివప్రసాద్, ప్రకాష్, భూమయ్య, కౌన్సిలర్ ఉమారాణి, కాంగ్రెస్ పట్టణ, మండలాధ్యక్షులు గంగాధర్, రాజం, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

బోనమో' మల్లన్న

మెట్‌పల్లి రూరల్: చింతలపేటలో బోనాలు తీస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 17: చింతలపేటలో నాలుగు రోజులుగా జరుగుతున్న మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామస్తులు బోనాలు నిర్వహించారు. కాగా సోమవారం అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి

- జగిత్యాల జిల్లాలో వేర్వేరు ఘటనల్లో దుర్మరణం

చిన్నరాయుడు, దీటి శంకర్ (ఫైల్)

కోరుట్లరూరల్/మారుతీనగర్ మార్చి 17: చేపల వేటకు వెళ్లిన ఇద్దరు కానరానిలోకానికి వెళ్లారు. జగిత్యాల జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో దుర్మరణం చెందారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం..కోరుట్ల రూరల్ మండలం సంగెం గ్రామానికి చెందిన ఇడగొట్టు చిన్నరాయుడు (34) ఆదివారం ఉదయం స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని వాగులోకి చేపలవేటకు వెళ్లాడు. ఇనుప కడ్డీకి విద్యుత్ తీగెను తగిలించి చేపలు పడుతుండగా కరెంట్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో మెట్‌పల్లి పట్టణం దుబ్బవాడకు చెందిన దీటి శంకర్ (50) ఆదివారం చేపలు పట్టేందుకు మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన రేగుంట పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటమునిగి మరణించాడు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు